క్లుప్తంగా

ఆందోళన విరమించిన కాంట్రాక్టు ఉద్యోగులు


ఆందోళన చేస్తున్న సోలార్ ఉద్యోగులు

పావగడ: స్థానిక తిరుమణి సోలార్ పార్క్‌లో విధులు నిర్వహిస్తున్న సోలార్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎట్టకేలకు ఆందోళన విరమించారు. జీతాలు సక్రమంగా అందించాలని వారం రోజులుగా ఆందోళ చేస్తున్నారు. ప్రతి నెలా 3న అందాల్సిన వేతనాలు 15వ తేదీ దాటినా ఇవ్వక పోవడంతో కుటుంబాలు ఎలా పోషించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవులు సైతం సక్రమంగా ఇవ్వడం లేద న్నారు. తాలూకా ఇంజినీర్ మహేశ్ ఉద్యోగులపై దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే సీఈఓ శివప్రసాద్ హామీ ఇవ్వడంతో బుధవారం ఉద్యోగులు ఆందోళన విరమించారు.వారం రోజుల్లోగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని సీఈఓ హామీ ఇచ్చారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

హిందూపురం: పట్టణంలోని డీఆర్ కాలనీకి చెందిన చింటుపై మోతుక్కుపల్లి వద్ద బాపూజీ నగర్‌కు చెందిన సీఎస్‌పీ నాగరాజు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు తెలిపారు. పలుసార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోక పోవడంతో నాగరాజును అరెస్టు చేశామన్నారు.

లైసెన్స్‌లేనివారికి రూ.5 వేలు జరిమానా


రహమత్‌పురం సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టిన సీఐ అబ్దుల్‌కరీం

హిందూపురం: హిందూపురం రహమత్‌పురం సర్కిల్ వద్ద టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేని వారికి రూ.5 వేలు, హెల్మెట్ లేని వారికి రూ.వెయ్యి చొప్పన జరిమానా విధించారు. సుమారు పది వాహనాదారులకు జరిమానాలు విధించి నిబంధనలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం


ఎం.రాయాపురంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా డెయిరీలో కొలువుదీరిన గణనాథుడి విగ్రహాన్ని బుధవారం సాయంత్రం కమిటీ సభ్యులు ఘనంగా నిమజ్జనం చేశారు. గత 21 రోజులుగా వినాయకుడిని కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని ఆటోలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. తర్వాత గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.


శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి దేవాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలను అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం వీరభద్రస్వామి దేవాలయంలో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రోజూ ఆలయ సాంప్రదాయాలతో దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు, యాత్రికులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా దర్శనమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రత్యేక ఆశీర్వాద మండపంలో పూజలు చేయిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు అన్నప్రసాద పంపిణీకి దాతలు ముందు రావాలన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసి ఆలయ ప్రతిష్టను మరింత పెంచాలని కోరారు.

కేంద్రాలు లేక కొనుగోల

- మడకశిర డివిజన్‌లో 1,900 హెక్టార్లలో మొక్కజొన్న సాగు
- నూర్పిడి పనులు ప్రారంభం
- నేటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో అన్నదాతలు




ఎల్లోటిలో నూర్పిడి చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న

మడకశిర రూరల్: ఎన్నో ఒడిదుడుకుల మధ్య మొక్కజొన్న సాగు చేసిన రైతుల బాధలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా నేటికీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారని, దీని వల్ల నష్టపోవాల్సి వస్తుందని వెంటనే కూటమి ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కర్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మడకశిరలో 1900 హెక్టార్లలో సాగు

మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో 1,900 హెక్టార్లుల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఎకరా పంట సాగుకు దాదాపు రూ.25 వేల వరకూ ఖర్చు చేశారు. మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.3 వేల గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే కొంత వరకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. పండించిన పంటకైనా కూటమి ప్రభుత్వ క్వింటాల్‌కు రూ.3 వేల గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

ప్రైవేటుగా అమ్మితే నష్టం

కూటమి ప్రభుత్వం క్వింటాల్ మొక్కజొన్నకు రూ.2,400 మద్దతు ధర ప్రకటించిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే నేటికీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాడే కనిపించడంలేదు. పంట కూడా ఆశాజనకంగా ఉంది. రైతులు పంటను కోసి విక్రయించడానికి ముమ్మరంగా నూర్పిడిళ్లు చేసి విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యాపారస్తులు క్వింటాల్ విత్తనాలు రూ.2 వేల నుంచి రూ.2,100 ప్రకారం కోనుగోలు చేస్తున్నారు. ఈ ధరకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అరుగాలం కష్టపడి పంట పండించినా మార్కెట్‌లో వ్యాపారస్తులు ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా కోనుగోలు కేంద్రాలు మాత్రం ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కోనుగోలు కేంద్రాలు ప్రారంభించి మొక్కజొన్న కోనుగోలు చేయాలి. మూడు ఎకరాల్లో పంటను తొలగించి నూర్పిడి పనులు చేపట్టాం.

– కరియన్న, హారేసముద్రం, మడకశిర మండలం

గిట్టుబాటు ధర పెంచాలి



కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు ప్రభుత్వం రూ.3 వేల గిట్టుబాటు ధర కల్పించాలి. అలాగే కోనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి. నాలుగు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను నూర్పిడి చేసి దాదాపు 100 క్వింటాల్ విక్రయించడానికి సిద్ధం చేశాం. కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయి. పంట నిల్వ ఉంచుకోలేక తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఉంటుంది.

– శ్రీరామరెడ్డి, ఎల్లోటి, మడకశిర మండలం

'చలో పెనుకొండ'కు తరలిరండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేయనున్నట్లు పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప, యువజన విభాగం మడకశిర నియోజకవర్గ అధ్యక్షుడు శేషాద్రి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శుక్రవారం చలో పెనుకొండ మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం దిగివచ్చే వరకూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని చలో పెనుకొండ మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


అబ్దుల్ లతీఫ్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లేపాక్షి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అబ్దుల్ లతీఫ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్‌తో పాటు వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, నాయకులు మల్లన్న, ఇర్ఫాన్, చాందాభాషా, మైదుగోళం రామాంజి, చంద్రశేఖర్‌రెడ్డి, అన్సార్, అబ్రార్, సనావుల్లా, రామాంజి తదితరులు అబ్దుల్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మండల కన్వీనర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


బాలంపల్లిలో గ్రామ కమిటీ నేతలతో సమన్వయకర్త టీఎస్ దీపిక

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక అన్నారు. బుధవారం ఆమె హిందూపురం రూరల్ మండలంలోని బాలంపల్లి, చలివెందుల పంచాయతీలో ఆమె పర్యటించి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీలను కార్యకర్తల సమక్షంలో ఏర్పాటు చేశారు. దీపిక మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ బలంగా ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యర్థులను ఓడించగలుగుతామన్నారు. పార్టీలో ఎలాంటి సమస్యలొచ్చినా తనతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. బేదాభిప్రాయాలు అనేవి పార్టీలో ఉండకూడదన్నారు. కష్టపడిన వారికి భవిష్యత్‌లో మంచి అవకాశాలు, పదవులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాము, జిల్లా నాయకులు గిరీష్‌కుమార్, తిప్పేరుద్రయ్య, సర్పంచ్ ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల మీట్


మాట్లాడుతున్న ఎంపీడీఓ కేశవరెడ్డి

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ఈసారి మొక్కుబడిగా సాగింది. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కాకపోవడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతూ క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. నానో యూరియాపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై సర్పంచులు, ఎంపీటీసీలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. గ్రామాల్లో తాగునీటి బోరుబావులకు విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నా విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, తహసీల్దారు శ్రీధర్, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, వైస్ ఎంపీపీ రత్నమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


అమరాపురంలో విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం


పావగడలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వకర్మ వర్గం నాయకులు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామం నాడ కచేరిలో విశ్వకర్మ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజలు చేశారు. స్థానిక విశ్వకర్మ సంఘం నాయకుడు సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

తాలూకా కార్యాలయంలో...
కంసలి సామాజిక వర్గం ఆరాధ్య దైవమైన విశ్వకర్మ జయంతి వేడుకలు స్థానిక తాలూకా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వై రవి విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు. అంతకు ముందు విశ్వకర్మ వర్గం నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

అమరాపురంలో...
అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీ నరసింహా ఆధ్వర్యంలో విశ్వకర్మ యోగి దినోత్సవాన్ని నిర్వహించారు. యోగి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతులు మోస్తున్న భక్తులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బుధవారం గ్రామాల భక్తులు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో జ్యోతులను ఊరేగింపుగా తీసుకు వచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలు విజయవంతం చేయండి


రొళ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది

రొళ్ల: మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లలో అక్టోబర్ 16 వరకూ 'పోషణ మాసోత్సవ' కార్యక్రమాలను అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సంయుక్తంగా నిర్వహించాలని తహసీల్దార్ షేక్షావలి, సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో మండల స్థాయి అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పోషణ మాసోత్సవాలపై అవగాహన కల్పించారు.

మడకశిరరూరల్: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామస్థాయిలో అక్టోబర్ 16 వరకూ మహిళల ఆరోగ్యం కోసం నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. బుధవారం కల్లుమర్రి, కదిరేపల్లి, నీలకంఠాపురం ఆరోగ్య కేంద్రాల్లో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లీలావతి, వైద్యులు, అంగనవాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహించే ఆరోగ్య వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అంబరీష్ తెలిపారు. బుధవారం గ్రామ సచివాలయాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించి మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి


మడకశిర: పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్

హిందూపురం టౌన్: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం అందరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆస్పత్రిలో స్వస్థ్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాన్ని ఆరోగ్యంగా చూసుకుంటుందన్నారు. అందుకోసమే ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాల కోసం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

మడకశిర: పట్టణంలోని మల్లినాయకనపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మెడికల్ ఆఫీసర్ శృతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. మహిళలు ఈకార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హిందూపురం: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని సంతేబిదనూర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్లు అనురాధ, శాంతికుమారీ పిలుపునిచ్చారు. మహిళా ఆరోగ్య భద్రత కోసం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మడకశిరలో భారీ వర్షం


జలమయమైన కొత్త మసీదు రోడ్డు

మడకశిర: పట్టణంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మడకశిరలో 26.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. దాదాపు గంటసేపు విరామం లేకుండా వర్షం పడడంతో పట్టణంలో ప్రధానరోడ్లన్నీ జలమయ్యమయ్యాయి. అలాగే అగళి మండలంలో 29.2, రొళ్ల మండలంలో 18.2, అమరాపురంలో 3, గుడిబండలో 3.4 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

అర్హులకు ఇళ్ల నిర్మాణం


మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

మడకశిర: పట్టణ పరిధిలో అర్హులైన పేదలకు పీఎంఏవై ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పీఎంఏవై కింద చేపట్టే ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంగీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ 10 రోజుల పాటు జరిగే ఈకార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. మడకశిర మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలకు ఈ కార్యక్రమాలను ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, హౌసింగ్ ఏఈ రఘునందన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రతిభ చూపిన పురం విద్యార్థులు

హిందూపురం: అనంతపురం ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి అనంతపురం జిల్లా పోటీల్లో హిందూపురానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కోచ్‌లు ఫైరోజ్, ఉసామా, చరణ్ తెలిపారు. రియాజ్, సయ్యద్, శోభన్, నేహ, గ్రీష్మిత, మమత, ధనంజయ, షేక్ యాహియా, అబ్దుల్లాఖాన్, దీక్షిత్, సాహిల్, శ్రీ చరణ్‌లు మొదటి స్థానం సాధించారన్నారు. యాసీన్ తాజ్, తయ్యబా, తహసీన, జాన్ విక్టర్, సాజిద్ ఖాన్, హితేష్ దత్త, అభిలాష్, వరాహ శివశంకర్, తిరుమలేష్ రెండో స్థానం, కార్తికేయ, నిఖిలేంద్ర, జైద్, రిషిరామ్, అనాస్, పీఎండీ జైద్ , హిమవర్షిత, సుప్రియ మూడోస్థానం సాధించారని పేర్కొన్నారు. ప్రథమ స్థానం నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ఘనంగా గంగమ్మదేవి ఊరేగింపు


గంగమ్మదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలో గంగమ్మదేవి ఉత్సవ విగ్రహాన్ని బుధవారం గ్రామంలో పల్లకీలో ఊరేగించారు. ఉదయం గంగమ్మదేవికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ బొడ్రాయి వద్ద పూజలు చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం


కమిటి సభ్యులకు చెక్కు అందిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

లేపాక్షి: మండలంలోని మామిడిమాకులపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సత్యమ్మ దేవాలయం అభివృద్ధికి హిందూపురానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి రూ.లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యాక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, వెంకటరెడ్డి, శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ లైసెన్స్ పునరుద్ధరించాలి

గుడిబండ: పేదలకు సేవ చేసే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సేవలను కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలని, ఆర్డీటీ ఎఫ్ఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేసి సంక్షేమ పథకాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని మద్దనకుంట గ్రామ పంచాయితీ సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప డిమాండ్ చేశారు. బుధవారం మద్దనకుంట గ్రామ ప్రజలు, ఆర్డీటీ మహిళా సంఘాల సభ్యులు కలిసి గ్రామ సర్పంచ్ జగదాంబక్రిష్టప్పకు వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో పాఠశాలలు, గృహాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించి ఎందరో పేద విద్యార్థులకు విద్య అందిస్తోందన్నారు. ఆర్డీటీ సేవలు నిలిచిపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.